సాక్షి
అనకాపల్లి
సోమవారం ; 1 ; మే ; 2023



ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

వాణిజ్య పంటగా ఆయిల్ పామ్ జిల్లాలో విస్తారంగా సాగవుతోంది.
8లో



కన్యకాపరమేశ్వరికి లక్ష మల్లెల పూజ

స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు ఆదివారం ఆలయ ఆవరణలో నేత్రపర్వంగా సాగాయి.
8లో



గంజాయి వ్యాపారులపై దాడులు

రోలుగుంట ఎస్‌ఐ నాగకార్తీక్ తన సిబ్బందితో కలసి శని, ఆదివారాలు గంజాయి స్థావరాలపై దాడులు జరిపారు.
8లో

న్యూస్‌రీల్

టెక్నికల్ టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్ : ఆంధ్రప్రదేశ్ విజయవాడ ప్రభుత్వ డైరెక్టర్ పరీక్షల విభాగం టెక్నికల్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం పేర్కొన్నారు. (42 రోజుల శిక్షణ)కోర్స్ ప్రాక్టికల్స్ 2023 సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల్లో పని చేసే ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం వైబ్‌సైట్ www.bre.ap.gov.in నందు ఈనెల 29 నుంచి మే 6వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆమె తెలిపారు. అభ్యర్థులు పై వెబ్‌సైట్‌లోగాని, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కాని దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

తైక్వాండోలో ఆరుగురికి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ చందు

ఎస్.రాయవరం : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అడ్డురోడ్డు విద్యార్థులు ఆరుగురు పతకాలు సాధించినట్టు కోచ్‌చందు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్ లో జరిగిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో ఆరుగురు పతకాలు పొందారని తెలిపారు. జి.సాయితేజశ్వేతశ్రీ బంగారం, ఆర్.హాసిని, పి.ప్రసన్నలకు కాంస్య, ఎస్.వరలక్ష్మి, పి.చైతన్య ఆదిత్య చరణ్ తేజ, డి.రాజేష్‌లకు రజత పతకాలు సాధించారన్నారు. వీరిని కోచ్ చందు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్చుత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.అచ్చన్నాయుడు, సీనియన్ కోచ్ ఎస్. సత్యానారాయణ, కుటుంబ సభ్యులు అభినందించారు.

పూర్తయిన స్పాట్ వాల్యుయేషన్

అనకాపల్లిటౌన్ : టెన్త్, ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ఆదివారం పూర్తయిందని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ హైస్కూల్ ఆవరణలో ఏప్రిల్ 19 నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు టెన్త్ పరీక్ష లక్షా 80 వేల పేపర్లు, 27 నుంచి 30 వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష 20,968 పేపర్లను 1,370 ఉపాధ్యాయులు వాల్యూయేషన్ చేశారని పేర్కొన్నారు. నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నామన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లో ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో తరగతులు నిర్వహించినట్లయితే గుర్తింపు రద్దు చేస్తామని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొన్ని కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వాటిపై నిఘా పెట్టామన్నారు. అలాగే కాలేజీల్లో ఎటువంటి అడ్మిషన్లు కూడా చేపట్టడానికి వీల్లేదన్నారు.

నేడు ఏయూ ఇంజనీరింగ్ ఎచీవర్స్ డే

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎచీవర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించి, విద్యార్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. ఈ విద్యా సంవత్సరంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 1500 వందలకు పైగా ఉపాధి అవకాశాలు లభించాయి. ఇంకా మరికొన్ని సంస్థలు నియామకాలకు సంబంధించిన ఫలితాలను వెలువరించాల్సి ఉంది. అత్యధిక ఉద్యోగ అవకాశాలతో పాటు, అత్యధిక వేతనాలను సైతం ఈ బ్యాచ్ విద్యార్థులు సాధించారు. ఈ ఆనందాన్ని వారి తల్లిదండ్రులతో పంచుకునే వేడుకకు వర్సిటీ ఘనంగా ఏర్పాటు చేసింది.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత ఆదివారం నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈనెల 5వ తేదీన వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చి చందనం(120కిలోలు) కోసం ఈ అరగదీతను చేపట్టారు. ఆలయ బేడామండపంలో సుమారు 15మంది సిబ్బంది సుమారు 30 కిలోలు చందనాన్ని అరగదీశారు. మరో మూడు రోజులపాటు చందనం అరగదీత చేపట్టనున్నారు.

ఉత్తరాంధ్రకు మహర్దశ

- గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాకారం
- నవరత్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోరుకునే ముఖ్యమంత్రి జగన్
- మీ ఆశీస్సులతో 2024లో మరోసారి విజయఢంకా మోగించడం ఖాయం
- చోడవరం, మాడుగులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన వై.వి.సుబ్బారెడ్డి



గవరవరం వంతెనను ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి



బోయిలకింతాడలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వై.వి. సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

సాక్షి, అనకాపల్లి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ పరుగులు పెడుతున్నాయని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని కొనియాడారు. అనకాపల్లి జిల్లాలోని చోడవరం, మాడుగుల నియోజవర్గంలో ఆదివారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మాడుగుల నియోజకవర్గంలో కాశీపురం నుంచి గవరవరం వరకు రూ. 20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.22లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. చోడవరం నియోజకర్గంలో రూ.12 కోట్లతో నిర్మించిన గవరవరం వంతెనను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, విద్య, వైద్యం రంగాల్లో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని.. .మీ ఆశీస్సులతో రానున్న 2024 ఎన్నిలకల్లో మరోసారి విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో ఘన స్వాగతం

చోడవరం: గవరవరం వంతెన ప్రారంభోత్సవానికి వచ్చిన సుబ్బారెడ్డికి చోడవరంలో ధర్మశ్రీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుంచి వందలాది మోటారు సైకిళ్లతో భారీ బైక్ ర్యాలీ చేశారు. చోడవరం, అన్నవరం, రేవళ్లు, లక్కవరం మీదుగా గవరవరం వంతెన వరకూ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మీడియాతో సుబ్బారెడ్డి మాట్లాడుతూ చోడవరం, మాడుగుల నియోజవర్గాలను కలిపే గవరవరం వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే గత టీడీపీ ప్రభుత్వం కనీసం శ్రద్ధ పెట్టి వంతెన నిర్మాణం పూర్తిచేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వానికి చెప్పడంతో పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో పోర్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందని, దీనివల్ల ఆ ప్రాంతంలో వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. మే 3వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు. విశాఖపట్నంలో వైజాగ్ టెక్ పార్కుపేరుతో అభివృద్ధి చేయబోయే అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, మండల అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు, బూరె బాబూరావు, జెడ్పీటీసీలు కర్రి సత్యం, రాంబాబు పాల్గొన్నారు.



చోడవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు

మహానేత విగ్రహావిష్కరణ

దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడలో వైవీ సుబ్బారెడ్డి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ సత్యవతితో కలిసి మహానేత డా. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాడు మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని, నేడు అదే బాటలో ఆయన తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పాలన సాగిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యానాయుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మాడుగుల నియోజకవర్గంను అభివృద్ధి, సంక్షేమంలో మోడల్‌గా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో 75 సచివాలయాలకు గాను 53 సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు.

అనంతరం సకల సదుపాయాలతో సచివాలయాన్ని నిర్మించిన స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావును వైవీ సుబ్బారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ, నియోజకవర్గ పరిశీలకుడు అప్పారావు, ఎంపీపీ రాజేశ్వరి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీటీసీ రుత్తల లక్ష్మీ, కర్రి సూరినాయుడు, డా. వి.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ 50వ వార్షికోత్సవం

- ఈ నెల 4 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



యలమంచిలి : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జయంతోత్సవాలు ఆదివా రం నుంచి ఘనంగా ప్రారంభమయ్యా యి. ఆదివారం అమ్మవారికి 108 కలశాలతో సామూహిక మంగళస్నానం చేయించి పంచామృతాభిషేకం నిర్వహించారు. 108 మంది దంపతులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం 108 రకాల హారతులు ఇచ్చా రు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు సత్యగుప్తా, కౌన్సిలర్ కట్టమూరి సుజాతను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్సవాల వివరాలు చార్టెడ్‌అకౌంటెంట్ బి.ఎస్ బంగారు శెట్టి మీడియాకు తెలిపారు. ఈ నెల 1వ తేదీ సోమవా రం ప్రత్యేకాభిషేకం అనంతరం 108 మంది యువతులతో కుంకుమ పూజలు, 2వ తేదీ మంగళవారం నెయ్యితో తొలి అభిషేకం, రాత్రి దీపాలంకరణ సేవ, మహిళలతో కోలాటం, 3వ తేదీ బుధవారం తేనెతో ప్రత్యేకాభిషేకం, 108 మంది మహిళలతో కుంకుమ పూజ, 4వ తేదీ గురువారం పండ్ల రసాలు సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, రాత్రి పవళింపుసేవ నిర్వహిస్తారు. ప్రతి రోజు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పురవీధుల్లో ఉత్సవమూర్తి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.



మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు



కార్తీక్



గుణశేఖర్



హర్షవర్ధన్

రావికమతం : జెఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో రావికమతం, యర్రబంద గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఎర్రబంద గ్రామానికి చెందిన మచ్చ కార్తీక్ ఓబీసీ కేటగిరిలో 81వ ర్యాంక్ సాధించాడు. కార్తీక్ తల్లిదండ్రులు శ్రీను, నాగమణి రైతు కుటుంబానికి చెందినవారు. రావికమతానికి చెందిన ముమ్మిన గుణశేఖర్ ఓబీసీ కేటగిరీలో 246 ర్యాంక్ సాధించారు. గుణశేఖర్ తల్లిదండ్రులు చిన్నారావు, నూకరత్నం కూడా రైతు కుటుంబానికి చెందినవారే. కార్తీక్ గుణశేఖర్ ఇరువురూ విశాఖలోని శ్రీ విశ్వ కాలేజీలో చదువుతుండగా, రావికమతానికి చందిన ఉగ్గిన హర్షవర్ధన్ ఓబీసీ కేటగిరీలో 2,463 ర్యాంక్ సాధించాడు. హర్షవర్ధన్ విశాఖలో నారాయణ కాలేజీలో చదువుతున్నాడు. తల్లిదండ్రులు శ్రీనివాస్, సుజాత కూడా రైతు కుటుంబానికి చెందిన వారే. వీరు ఉన్నత ర్యాంకులు సాధించడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

నా కెరీర్‌లో మైలురాయిగా 'ఉగ్రం'

హీరో అల్లరి నరేష్



మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్. చిత్రంలో హీరోయిన్ మిర్నా మీనన్

దాబాగార్డెన్స్: 'ఉగ్రం' తన సినీ కెరీర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచి పోతుందని ఆ చిత్ర హీరో అల్లరి నరేష్ అన్నారు. విశాఖ నగరంలో ఆదివారం చిత్ర యూనిట్ సందడి చేసింది. నాంది హిట్ చిత్రం తర్వాత హీరో అల్లరి నరేష్ ..దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందించిన చిత్రమే ఉగ్రం. అల్లరి నరేష్‌కు జతగా మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అల్లరి నరేష్ మాట్లాడుతూ ఇది తనకు 60వ చిత్రమని తెలిపారు. నాంది సినిమాకు మించి ఈ చిత్రం ఉంటుందన్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో 1.5 లక్షల మంది కనిపించకుండా పోయారనే విషయం తెలిసిందేనని, వారంతా ఏమయ్యారో ఇప్పటికీ తెలియదంటూ రూపొం దించిందే ఉగ్రం చిత్రమని పేర్కొన్నారు. ఈ నెల 5న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు అల్లరి నరేష్ తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల్లో వాచ్‌మన్

- పేరెంట్ కమిటీల ద్వారా పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్ల నియామకం
- జిల్లాలో 216 వాచ్‌మన్ ఉద్యోగాలు భర్తీ



సాక్షి, అనకాపల్లి: రాష్ట్రంలో నాడు–నేడుతో వేలాది కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాల ఆధునికీకరణ, నూతన భవనాల నిర్మాణ పనులను చేపట్టి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ..పాఠశాలల భద్రత, అక్కడి పరికరాలు, ఇతర సదుపాయాల పరిరక్షణ కోసం నైట్ వాచ్‌మన్ల నియామకాన్ని చేపట్టింది. వాచ్‌మన్లుగా నియమితులైన వారికి నెలకు రూ.6 వేలు చొప్పున గౌరవ వేతనం కూడా కల్పిస్తుంది. ఈ నియామక ప్రక్రియను ప్రభుత్వ పాఠశాలల పేరెంట్ కమిటీలు, హెడ్‌మాస్టర్లు పర్యవేక్షణలో జరుగుతోంది. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో నియామక ప్రక్రియ కసరత్తు జరుగుతోంది. జిల్లా 220 ప్రభుత్వ పాఠశాలలుండగా..వాటిలో 216కి నైట్‌వాచ్‌మెన్ నియామక ప్రక్రియ జరుగుతుంది.

ఎంపికలో పాటించినవి ఇవే...

- జిల్లాలో 216 పాఠశాలల పేరెంట్ కమిటీలు, హెడ్ మాస్టర్‌లు
- ఇప్పటికే నియమితులైన ఆయా/కుక్ కమ్ హెల్పర్ భర్తకు మొదటి ప్రాధాన్యం
- గ్రామం/వార్డులో మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యం
- వీరెవరూ అందుబాటులో లేకపోతే ఇతర వ్యక్తిని నియమించవచ్చు.
- నైట్ వాచ్‌మన్ గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక నివాసి అయి ఉండాలి.
- ఆ వార్డులో అందుబాటులో లేకుంటే, సంబంధిత పట్టణ ప్రాంతాల నివాసిని ఎంపిక చేయాలి.
- వయసు 60 ఏళ్లలోపు ఉండాలి.

ఇవీ విధులు..

- ప్రతి రోజూ పాఠశాల మూసివేయడానికి ముందు సాయంత్రం పాఠశాలకు హాజరు కావాలి.
- పని దినాల్లో మరుసటిరోజు పాఠశాల తెరిచే వరకు విధుల్లో ఉండాలి. సంబంధిత ప్రధానోపాధ్యాయుని పర్యవేక్షణలో పనిచేయాలి. పాఠశాల ఆస్తి అయిన భవనం/ప్రాంగణం, ఇతర వస్తువులు, పరికరాలకు రక్షణ చూడాలి.
- పాఠశాల ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా చూడాలి.
- ఏవైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినప్పుడు, అగ్నిప్రమాదం వంటివి ఏర్పడినప్పుడు సంబంధిత హెడ్ మాస్టర్‌కు, సమీప పోలీస్ స్టేషన్‌కు, అగ్నిమాపక విభాగానికి నివేదించాలి.
- సాయంత్రం పాఠశాలలో గల గార్డెన్‌లో మొక్కలకు నీరు పోయాలి. ఆర్వో ప్లాంట్ శుభ్రం ప్రక్రియను తీసుకోవాలి. పాఠశాలకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకురావడం, వాటిని హెచ్ఎంకు అందించడం చేయాలి.నైట్ వాచ్‌మన్ పనిని హెడ్‌మాస్టర్, పేరెంట్స్ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

నియామకం ఇలా

నియోజకవర్గం	వాచ్‌మెన్‌లు
అనకాపల్లి	- 25
నర్సీపట్నం	- 30
పాయకరావుపేట	- 33
యలమంచిలి	- 32
చోడవరం	- 30
మాడుగుల	- 33
పెందుర్తి (సబ్బవరం, పరవాడ)	- 33

200 మంది వాచ్‌మన్ల భర్తీ

జిల్లాలో 220 ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్ పోస్టులకు 216 పాఠశాలలకు 200 మంది సిబ్బందిని భర్తీ చేశామని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదివారం పేర్కొన్నారు. గతంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు వాచ్‌మెన్లు ఉన్నారని, మరో 16 పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని ఆమె తెలిపారు.

1 నుంచి విధుల్లో వాచ్‌మన్

వాచ్‌మెన్ నియామక ప్రక్రియను దాదాపు పూర్తి చేశాం. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మే నెల 1 నుంచి వాచ్‌మెన్‌లు విధుల్లో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్ల పరిసరాల పరిరక్షణతో పాటు వాటి భద్రత బాధ్యతను వాచ్‌మెన్‌లు తీసుకుంటారు.

–వెంకట లక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి జిల్లా

అనకాపల్లికి రూట్ క్లియర్

- పట్టణానికి తప్పిన ట్రాఫిక్ సమస్య
- జాతీయ రహదారి అభివృద్ధితో ట్రాఫిక్ మళ్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు



గతంలో సుంకరమెట్టు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)



పట్టణానికి చేరుకునే శంకరం రోడ్డులో వాహనాల రద్దీ లేని దృశ్యం

తుమ్మపాల : నూతన జిల్లాగా ఏర్పాటుతో పాటు జిల్లా కేంద్రంగా మారిన అనకాపల్లికి వచ్చేందుకు ట్రాఫిక్ సమస్య లేకుండా లైన్ క్లియర్ అయ్యింది. విశాఖ–విజయవాడ జాతీయ రహదారి మీదుగా శ శరవేగంగా అనకాపల్లి దగ్గరకు వచ్చినప్పటికీ, బైపాస్ జంక్షన్ నుంచి పట్టణంలోకి చేరడానికి గంటల సమయం పడేది. విజయవాడ వైపు, కోల్‌కతా వైపుగా వచ్చే వాహనాలు కూడా పట్టణంలోకి వచ్చే జాతీయ రహదారికి రావాల్సి వచ్చేది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు ఎదురయ్యేవి. ఇకపై ఆ సమస్య లేదు. పట్టణంలోకి వచ్చే వాహనాలకు మాత్రమే ప్రవేశం కల్పించారు. మిగిలిన వాహనాలు నేరుగా ఆనందపురం రహదారి చేరుకునేలా లైన్ క్లియర్ చేశారు.

అటు విశాఖ, ఇటు సబ్బవరం ప్రాంతాల నుంచి అనకాపల్లి పట్టణంలోకి చేరాలంటే ఇదివరకు నరకయాతన పడాల్సి వచ్చేది. రెండురోడ్ల రహదారి ఆపై దుమ్ము ధూళితో పాటు ట్రాఫిక్ రద్దీ కారణంగా ద్విచక్ర, ఇతరత్రా వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విజయవాడ నుంచి కోల్‌కతా వైపుగా వెళ్లే వందలాది భారీ, సరకు రవాణా వాహనాల రాకపోకలతో అనకాపల్లి సుంకరమెట్ట, శంకరం వైపు గల రోడ్లు నిత్యం రద్దీగా ఉండేవి. సబ్బవరం నుంచి అనకాపల్లి, విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే వాహనాలతో పాటు విజయవాడ నుంచి సబ్బవరం వైపుగా వచ్చే వాహనాలు పట్టణంలో సూర్యనారాయణస్వామి ఆలయం వై జంక్షన్ వద్ద ఇరుక్కుని గంటల పాటు నిత్య ట్రాఫిక్ జామ్ జరగడం పరిపాటిగా ఉండేది.


జాతీయ రహదారి అభివృద్ధితో ట్రాఫిక్ మళ్లింపు

అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అత్యాధునిక టెక్నాలజీతో ఆరులైన్ల రోడ్డు అభివృద్ధి ఇటీవల పూర్తయింది. దీంతో విజయవాడ నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి పట్టణంలోకి రాకుండా నేరుగా అనకాపల్లి జంక్షన్ నుంచి శంకరం వద్ద ఏలేరు కాలువ వరకు పొలాల మధ్యలో వేసిన ఆరు లైన్ల రోడ్డుకు మళ్లించారు. కోల్‌కతా నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి పట్టణంలోకి రాకుండా ఇదే మార్గానికి మళ్లించారు. దీంతో శంకరం వద్ద నుంచి అనకాపల్లి, అనకాపల్లి బైపాస్ జంక్షన్ నుంచి పట్టణంలో వై.జంక్షన్ వరకు నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సమస్య పూర్తిగా సమసిపోయింది.

పరిసర గ్రామాలకు ఊరట

గ్రామీణ వాణిజ్య కేంద్రంగా పేరొందిన అనకాపల్లి పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో జనాభా వస్తుంటారు. దీంతో పాటు జిల్లా కేంద్రంగా అనకాపల్లి ఏర్పాటువడం, వివిధ శాఖలకు చెందిన జిల్లా కేంద్రాలు కూడా పట్టణంలోనే ఉండడంతో మరింతగా జనాభా రాకపోకలు పెరిగాయి. పట్టణానికి ప్రధాన ముఖద్వారంగా ఉండే సుంకరమెట్ట రోడ్డు, శంకరం రోడ్డు నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఇప్పుడు ఖాళీగా దర్శనమిస్తూ కేవలం పట్టణంలో పనులు ఉండేవారు మాత్రమే రాకపోకలు చేసేలా ఆయా శాఖలు మార్గం సుగుమం చేశారు. దీంతో అనకాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ట్రాఫిక్ సమస్య సమసిపోయింది



పట్టణంలోకి చేరాలంటే బైపాస్ జంక్షన్ నుంచి సూర్యనారాయణస్వామి ఆలయం వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యతో నరకయాతన పడాల్సి వచ్చేది. కానీ ఇటీవల బైపాస్ వద్ద భారీ వాహనాలు నేరుగా సబ్బవరం వైపు వెళ్తున్నాయి. దీంతో పట్టణంలోకి వచ్చే వాహనాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.

–కొత్తపల్లి సూర్య, వాహనదారు

నేరుగా కళాశాలకు...



నేను రోజూ రేబాక గ్రామం నుంచి డైట్ కళాశాలకు అనకాపల్లి మీదుగా వెళ్లేవాడిని. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణతో శంకరం నుంచి నేరుగా బైపాస్ జంక్షన్‌కు వెళ్ళి కళాశాలకు చేరుకుంటున్నాను. పట్టణంలో నుంచి వెళ్లేటప్పుడు ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఉండేది. ఇప్పుడు సమస్య తీరింది.

–గోగాడ మోహన్, విద్యార్థి

ప్రమాదాలు తగ్గాయి..

జాతీయ రహదారి అభివృద్ధితో పట్టణంలో సుంకరమెట్ట రోడ్డు ట్రాఫిక్ సమస్య 90 శాతం తగ్గింది. ప్రమాదాల సంఖ్య కూడా బాగా తగ్గింది. వాహనదారులు రాకపోకలు సౌకర్యవంతంగా ఉంది. బైపాస్ నుంచి శంకరం వరకు జాతీయ రహదారి చేయడంతో అటువైపుగా వాహనాలు మళ్లించాం.

–టి.శ్రీను, ట్రాఫిక్ సీఐ, అనకాపల్లి

క్లుప్తంగా

విద్యార్థి ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్ : డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన మండలంలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన పెంటకోట కన్నంనాయుడును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు గ్రామీణ సీఐ ఎ.రవికుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పెంటకోట మధుకుమార్(20)కి తల్లి దండ్రులకు తెలియకుండా అధిక వడ్డీకి కన్నంనాయుడు దఫ దఫాలుగా రూ.92వేలు అప్పుగా ఇచ్చాడు. మధుకుమార్ నుంచి వడ్డీ రూపంలో రూ.33వేలు వసూలు చేశాడు. అంతేకాకుండా వడ్డీ, అసలు చెల్లించమని తీవ్రంగా సదరు విద్యార్థిపై ఒత్తిడి చేయడంతో విద్యార్థి మధుకుమార్ ఏప్రిల్ 23న తన ఇంటి వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే నెల 25న చికిత్సపొందుతూ మృతి చెందాడని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసి కన్నంనాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ చెప్పారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


బల్లా దేవి మృతదేహం

మాడుగుల రూరల్: మాడుగుల దాసరి వీధికి చెందిన బల్లా దేవి అనే వివాహిత శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొన్ని రోజులుగా ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆ నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని బంధువులు తెలిపారు. మృతురాలి భర్త కొండబాబు పాడేరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పంచనామాకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

- చెరకు, సరుగుడుకు ప్రత్యామ్నాయంగా సాగు
- గిరిజన గ్రామాల్లో పెరుగుతున్న విస్తీర్ణం
- జిల్లాలో 8,100 హెక్టార్లలో పంట
- ఈ ఏడాది లక్ష్యం 1,500 హెక్టార్లు


తాటిపర్తి వద్ద మొక్క దశలో తోట


శంకరంలో కాటా వద్ద ఆయిల్‌పామ్ గెలలు దించుతున్న రైతులు

మాడుగుల రూరల్: వాణిజ్య పంటగా జిల్లాలో ఆయిల్ పామ్ విస్తారంగా సాగవుతోంది. ఈ ఏడాది 1,500 హెక్టార్లలో సాగు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యాన శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తుండటంతో చెరకు, సరుగుడు తోటలకు ప్రత్యామ్నాయంగా సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో దేవరాపల్లి, మాడుగుల, రోలుగుంట, నాతవరం, గొలుగొండ, కోటవురట్ల, తదితర మండలాల్లో 8,100 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతోంది. ప్రధానంగా మాడుగుల మండలం తాటిపర్తి, శంకరం, జాలంపల్లి, అవురువాడ, ఎల్. పొన్నవోలు, పొంగలిపాక పంచాయతీల శివారు గిరిజన గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఇక్కడ ఒకప్పుడు బీడుగా ఉండే భూములు నేడు ఆయిల్ పామ్ తోటలతో కళకళలాడుతున్నాయి.

ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలి

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ప్రాధాన్యత క్రమంలో వారికి మొక్కలు సరఫరా చేస్తారు. ఒక మొక్క రూ.133 కాగా, 90 శాతం సబ్సిడీపై పామాయిల్ కంపెనీ వారు అందిస్తున్నారు. సబ్సిడీ సొమ్ము ఆయా రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. విదేశాల నుంచి ఆయిల్ దిగుమతి వల్ల గెలల ధర తగ్గిందని రైతులు వాపోతున్నారు.

మొక్క దశ నుంచి ప్రభుత్వ ప్రోత్సాహకాలు..

మొక్క వేసిన తర్వాత నాలుగు నుంచి ఐదేళ్ల తర్వాత కాపునకు వస్తాయి. ప్రభుత్వం ఈ సాగుకు భారీ సబ్సిడీలు అందిస్తోంది. హెక్టారులో మొక్కలు నాటేందుకుగాను రూ.12 వేల నుంచి రూ.29 వేలకు సబ్సిడీ పెంచింది. ఎరువులకు రూ.20 వేల నుంచి రూ.21 వేలు, అంతర పంటలకుగాను రూ.20 వేల నుంచి రూ.21 వేలు పెంపుదల చేసింది. ఈ నగదు మొక్క నాటి నుంచి నాలుగేళ్ల పాటు ఉద్యానవన శాఖ ద్వారా అందించనుంది. వీటితోపాటు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు చిన్న, సన్నకారు రైతులకు ఐదెకరాల లోపు వారికి 90 శాతం, ఆపై దాటిన వారికి 50 శాతం సబ్సిడీని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అందిస్తుంది.

టన్నుకు రూ.13,796 చెల్లింపు

జిల్లాలో టెనీరా రకం ఆయిల్ పామ్ ఎక్కువగా సాగు చేస్తున్నారు. పంట పక్వానికి వచ్చాక గెలలు కోసేందుకుగాను కత్తులు, వర్మీకంపోస్టును ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్నారు. కాటాలు వద్ద గెలలకు తూకం వేసి జిల్లాలో బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, చీడికాడలో ప్రైవేటు కంపెనీలకు తరలిస్తున్నారు. అక్కడ టన్నుకు ప్రస్తుతం రూ.13,796 రైతులకు చెల్లిస్తున్నారు.

15 రోజులకొక సారి పేమెంట్లు



రైతులు ఆయిల్‌పామ్ గెలలు సరఫరా చేసిన 15 రోజుల వ్యవధిలోనే కంపెనీ వారు పేమెంట్లు చేస్తున్నారు. మాడుగుల మండలం తాటిపర్తి నుంచి శంకరం మధ్యలో కాటా దగ్గర రైతులు నుంచి ఆయిల్‌పామ్ గెలలు కొనుగోలు చేస్తున్నాం.

– జి.వి.దుర్గారావు, ఆయిల్‌పామ్ ఫీల్డ్ అసిస్టెంట్

అంతర పంటలతో అధిక ఆదాయం



ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా కోకో, అరటి పెంచడం వల్ల లాభం వస్తోంది. కోకో పంట నాలుగేళ్ల తర్వాత పక్వానికి వస్తుంది. డ్రిప్ ఇరిగేషన్, ఇతర సబ్సిడీలతో ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది.

– గంటా శ్రీనుబాబు, రైతు, తాటిపర్తి, మాడుగుల మండలం

జిల్లాలో పెరుగుతున్న సాగు



ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం 8,100 హెక్టార్లలో సాగువుతోంది. ఈ ఏడాది 1,500 హెక్టార్లలో సాగు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నాం. గిరిజన, మైదాన గ్రామాల్లో ప్రభుత్వ రాయితీలతో రైతులు సాగు పెంచాలి.

– జి. ప్రభాకరరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి, అనకాపల్లి జిల్లా

కన్యకాపరమేశ్వరికి లక్ష మల్లెపూల అర్చన


లక్ష మల్లెపూల అర్చనలో అమ్మవారి మూలవిరాట్


పేద మహిళలకు చీరలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- ఆకట్టుకున్న పల్లకీసేవ
- సంప్రదాయబద్ధంగా ఊంజల్‌సేవ

అనకాపల్లి టౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు ఆదివారం ఆలయ ఆవరణలో నేత్రపర్వంగా సాగాయి. తెల్లవారుజామున మేళతాళాల మధ్య పట్టణ పురవీధుల్లో అమ్మవారి పల్లకీసేవ సాగింది. ఆలయ ఆవరణలో గోపూజ, నిత్య ప్రార్థనలు, నగరేశ్వరస్వామి, జనార్ధన స్వామివారికి అర్చకులు అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తికి ధాన్యాభిషేకం, అమ్మవారి మూలవిరాట్‌కు లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

నేత్రపర్వంగా సారె ఊరేగింపు...

సాయంత్రం 102 రకాల మిఠాయిలతో మహిళా భక్తులు పురవీధులగుండా అమ్మవారి సారె ఊరేగించారు. భక్తిసంకీర్తనలు ఊరేగింపు ముందు ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ దంపతులు ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు


చోడవరం పార్టీ కార్యాలయంలో తన పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

చోడవరం: స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గవరవరం వంతెన ప్రారంభోత్సవానికి చోడవరం వచ్చిన ఆయనకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సోమవారం సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా అక్కడ పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ బండారు సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, మండలాధ్యక్షుడు డి. వెంకట్రావు, కంచిపాటి జగ్గారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, గూనూరు రాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారులపై పోలీసుల దాడులు

- ఇద్దరు నిందితుల అరెస్టు, 540 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులతో కృష్ణదేవిపేట పోలీసులు

రోలుగుంట: కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై బి.నాగకార్తీక్ తన సిబ్బందితో కలసి గంజాయి వ్యాపారాలు సాగిస్తున్న గ్రామాలపై శని, ఆదివారాలు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎం.కె.పట్నం సమీపంలో బుంగా రాజబాబు కళ్లాల వద్ద 26 గోనె సంచులతో నింపిన 540 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ నుంచి తరలించడానికి వాహనం కోసం సిద్ధంగా ఉంచిన ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, వీరిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్సై ఆదివారం సాయంత్రం తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు తమిళ యువకుల అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్ షెల్టర్ వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఉపేంద్ర వివరాల మేరకు.. బస్ షెల్టర్ వద్ద తమిళనాడుకు చెందిన శక్తివేల్, శంకర్, మహమ్మద్, శక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీలు చేశారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వద్ద బ్యాగ్‌లో 18 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. దీంతోపాటు ఐదు సెల్‌ఫోన్లు, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

తేలనున్న కాలేజీల లెక్క

- ప్రైవేటు జూనియర్ కాలేజీల తనిఖీకి త్రీమెన్ కమిటీ
- ఉమ్మడి విశాఖలో నాలుగు బృందాల ఏర్పాటు
- నిబంధనలు పాటిస్తేనే ప్రవేశాలకు అనుమతి


విశాఖలోని ఆర్ఐవో కార్యాలయం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా జూనియర్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. నిబంధనలు పాటించని కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గుర్తింపు కోసం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల్లో వాస్తవమెంతనేది సమగ్ర పరిశీలన చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 2023-24 విద్యా సంవత్సరంలో జూన్ 1న ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున, ఈలోగానే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

త్రీమెన్ కమిటీతో వాస్తవికత

ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలపై ఈ సారి నిశిత పరిశీలన చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్ఐవో/డీవీఈవో, ఒక ప్రిన్సిపాల్, ఒక సీనియర్ ఫిజిక్స్/జువాలజీ లెక్చరర్లతో కూడిన త్రీమెన్ కమిటీ నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు కమిటీలు ఏర్పాటు చేశారు. వీరు ఏ కాలేజీలను తనిఖీ చేయాలనేది నేరుగా కమిషనరేట్ నుంచి సమాచారం ఇవ్వనున్నారు. తనిఖీ సమయంలో త్రీమెన్ కమిటీలో ఉన్న ముగ్గురు అధికారులు, తాము క్షేత్రస్థాయిలో చూసిన పరిస్థితులపై వేర్వేరుగా తమ నివేదికను ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ముగ్గురు అధికారులు ఇచ్చిన నివేదికను బేరీజు వేసుకున్న తర్వాతనే ఆయా కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వనున్నారు.

నివేదిక మేరకే..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2022 - 23 విద్యా సంవత్సరానికి 382 జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు వద్ద నమోదయ్యాయి. వీటిలో 21 కాలేజీలు నిర్వహణలో లేవు. 13 కాలేజీల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరగలేదు. 6 కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా లేవు. ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో విశాఖపట్నంలో 151, అనకాపల్లిలో 77, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కాలేజీలు ఉన్నాయి. త్రీమెన్ కమిటీలు వీటిని తనిఖీ చేసి, ఇచ్చిన నివేదిక మేరకు 2023 - 24 విద్యా సంవత్సరంలో ఎన్ని కాలేజీలు నిర్వహణలో ఉంటాయనే లెక్క తేలనుంది.

నిబంధనలు పాటించాల్సిందే..

కాలేజీ నిర్వహణకు అనువైన భవనాలు, దీనికి సంబంధించిన వాస్తవ ధ్రువీకరణ పత్రాలు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, సైన్సు ల్యాబ్, అర్హత కలిగిన అధ్యాపకులు ఎంతమంది ఉన్నారనేది కమిటీ పూర్తి స్థాయిలో పరిశీలించనుంది. వీటికి సంబంధించి లేటెస్ట్ ధ్రువపత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసమని నిర్దిష్ట ప్రొఫార్మా రూపొందించారు. తనిఖీలో గుర్తించిన అంశాలను బృందం సభ్యులు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. లోపాలు సరిచేసుకునేలా ముందస్తు నోటీసు ఇచ్చిన అనంతరం, అన్ని రకాల నిబంధనలు పాటించిన కాలేజీలకే 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇవ్వనుంది.

ఏలేరు కాలువలో పూడిక తీత ప్రారంభం

- రూ.3 కోట్లతో జూన్ నెలాఖరుకు పనులు పూర్తి : జేఈ నానాజీ


ఏలేరు కాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

నాతవరం: ఏలేరు కాలువలో పూడిక తీత పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని జేఈ నానాజీ తెలిపారు. మండలంలోని ఏలేరు కాలువ 65 కిలోమీటరు వద్ద పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖపట్నం వరకు 154 కిలోమీటర్ల మేర పొడవునా ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తుందన్నారు. ఏటా వేసవిలో ఈ కాలువ మెయింటినెన్స్ పనులు చేస్తుంటామన్నారు. ఈ ఏడాది రూ.3 కోట్లతో మూడు ప్యాకేజీల కింద పనులు చేస్తామన్నారు. ఇందులో భాగంగా పూడిక తీత, గండ్ల మరమ్మతులు, తదితర పనులతో కాలువను పటిష్టం చేస్తామన్నారు. జూన్ నెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విశాఖ నగరానికి తాగునీరు, స్టీల్ ప్లాంటుతోపాటు పలు పరిశ్రమలకు రోజు ఒక్కంటికి 300 క్యూసెక్కుల చొప్పున నీరు తరలిస్తుంటామన్నారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు మాత్రమే కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గిస్తామన్నారు.

ముందుగానే ముగిసిన చేపల వేట

గొలుగొండ: మండలంలోని రావణాపల్లి జలాశయంలో ఆదివారం ఉదయంతో చేపల వేట ముగిసింది. ఈ జలాశయంలో ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు చేపల వేట నిర్వహిస్తుంటారు. ఇక్కడ రెండు వందల మంది జాలర్లు ఉమ్మడిగా వేట సాగించి ఆదాయం పొందుతారు. జలాశయంలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో ఈ ఏడాది ముందుగానే వేట నిలుపుదల చేశారు. ఇక్కడ జాలర్లు మరలా తాండవ జలాశయంలో వేట ప్రారంభిస్తారు.

కమ్మరిల్లు , పశువుల పాక దగ్ధం

రాంబిల్లి : లాలంకోడూరు శివారు రామచంద్రాపురంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నక్కా ఆదిలక్ష్మికి చెందిన పూరిల్లు(కమ్మరిల్లు), నక్కా నాగమణికి చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వీఆర్వో కుమార్ పట్నాయక్ తెలిపారు. బాధితులకు వైస్ ఎంపీపీ కళిరెడ్డి నర్సింగరావు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

రాజకీయాలంటే ప్రజలతో మమేకం


సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- విలువలకు పెద్దపీట వేసిన వైఎస్సార్ కుటుంబం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

సబ్బవరం: రాజకీయం అంటే సంక్షేమం, అభివృద్ధి మాత్రమే కాదని ప్రజలతో పెనవేసుకుపోయే బంధమని కొత్తభాష్యం తీసుకొచ్చింది వైఎస్సార్ కుటుంబం మాత్రమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తెలిపారు. నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ అభినందన సభ, ప్రమాణ స్వీకార కార్యక్రమం సబ్బవరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారంటే దానికి కారణం తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. పనులు చేసి ఓట్లు అడగాలని తాము అనుకుంటే.. మిగిలిన పార్టీలు అబద్ధపు హామీలు, అనైతిక పొత్తులు, ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమాల ద్వారా ఓట్లు అడగాలనుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధితో ఏ పనిచేసినా ప్రపంచం మెచ్చుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగుండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తుంటే... చంద్రబాబు తాను, తన పరివారం బాగుండాలని ఆలోచన చేస్తుంటారన్నారు. చంద్రబాబు తన హయాంలో టెంపరరీ పనులు చేపట్టారు కాబట్టే ప్రజలు టీడీపీని పక్కన పెట్టారన్నారు. చంద్రబాబు పచ్చ మీడియా సహకారంతోనే నెట్టుకొస్తున్నారు తప్పా ప్రజల్లో ఆదరణ లేదన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో రూ.2 లక్షల 4 వేల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసిందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని చంద్రబాబు వంచన చేసే మాటలు చెబుతున్నాడని.. ఆయన హయాంలో తమ ప్రభుత్వంలో కంటే ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానన్నారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ తాను రాజకీయ ప్రవేశం చేసిన నాటి నుంచి పాలిశెట్టి సురేష్‌రాజ్ తన వెన్నంటే ఉండి పార్టీకి సేవలందించారన్నారు. తాను ఈ రోజు ఇలా ఉన్నానంటే అందుకు కారణమైన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ముందుగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి అదీప్‌రాజ్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పరవాడ జెడ్పీటీసీ సన్యాసిరాజు, పార్టీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

- 13 మంది అరెస్టు
- రూ.15,490 స్వాధీనం

అనకాపల్లిటౌన్: పట్టణంలో పేకాట స్థావరాలపై ఆదివారం పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 13 మంది నుంచి రూ.15,490 నగదు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. గవరపాలెం దిబ్బవీధిలో ఐదుగురి నుంచి రూ.2,180, రావుగోపాలరావు కళాక్షేత్రం వద్ద ఐదుగురి నుంచి రూ.10,510, పూడిమడక రహదారిలో ముగ్గురి నుంచి రూ.2,800 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

తగ్గుతున్న పెద్దేరు నీటిమట్టం


పెద్దేరు జలాశయం

మాడుగుల: వేసవి ఎండలతోపాటు పంటలకు సాగునీటి విడుదలతో మండలంలో పెద్దేరు జలాశయం నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు, ప్రస్తుతం 131.15 మీటర్లకు తగ్గిపోయింది. ప్రస్తుతం జలాశయంలోకి 10 క్యూసెక్కుల సాగు నీరు వచ్చి చేరుతోంది. రబీ పంట కాలం పూర్తవడంతో సాగునీరు ఇప్పట్లో రైతులకు అవసరం లేదు. ఈ నేపథ్యంలో ప్రధాన పంట కాలువలు మూసి వేయడంతో ఇకపై జలాశయం నీటిమట్టం పెరుగుతుందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



తేగాడలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి ఆలయ అర్చకులు నగిరెడ్డి మంగ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఎన్నిక

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా వాకాడ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా మద్దాల కూర్మారావు, కోశాధికారిగా వేల్పుల గణేష్, ఉపాధ్యక్షునిగా శీరంశెట్టి నరసింగరావు, సహాయ కార్యదర్శిగా పనస శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

'మన్‌కీ బాత్'లో ప్రముఖుల పరిచయం

తుమ్మపాల : పట్టణంలో మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ గండి వెంకటసత్యనారాయణరావు ఆధ్వర్యంలో శక్తి కేంద్రంలో ఆదివారం ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలు అందించిన వారిని, మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని కొనియాడారు. ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అందరు వీక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రెసిడెంట్ వి.నర్సింగ యాదవ్, జిల్లా కార్యదర్శి వుడా రమేష్, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

జనసేన ప్రజాబాట

అనకాపల్లిటౌన్ : స్థానిక కోట్నివీధిలో జనసేన ప్రజాబాట కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్టీశ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,246 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,250	4,500
మొదటి రకం	3,990	4,250
రెండో రకం	3,560	3,970
మూడో రకం	3,440	3,550

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 207 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 117 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

బాల సదనం.. సమస్యల నిలయం

- అరకొర వసతుల మధ్యే బాలల జీవనం
- కలెక్టర్ ఆదేశాలతోనైనా మెరుగుపడేనా?

తల్లిదండ్రులు లేనివారు, ఇద్దరిలో ఏ ఒక్కరో దూరమైనవారు, నిరుపేద కుటుంబానికి చెందిన బాలికల పాలిట కల్పవల్లి బాలసదనం. ఎందరో బాలికలు జీవితంలో ఎదిగేందుకు సాయపడ్డ నివాసం. భారీ స్థాయిలో నిధులు వెచ్చించినా.. వారికి అవసరమైన వసతులు కల్పించలేకపోయారు. కనీస రక్షణ చర్యల్లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ కశింకోటలోని బాలసదనం దుస్థితి.



కశింకోటలోని బాల సదనం ప్రధాన భవనం



రాళ్లురప్పలతో అధ్వానంగా ఉన్న మైదానం



పాక్షికంగా దెబ్బతిన్న ప్రహరీ

కశింకోట : కశింకోటలోని బాల సదనంలో సదుపాయాలు కొరవడ్డాయి. దీంతో ఇక్కడ ఉండి చదువుకునే బాలలు ఏటా ఇబ్బందులను ఎదుర్కొనక తప్పట్లేదు. అధికారులు వచ్చిన ప్రతిసారీ సదనంలో వసతులు మెరుగుపరిచేందుకు హామీలు గుప్పిస్తున్నా.. అమలుకు మాత్రం నోచుకోవట్లేదు.

రూ.కోటిన్నర వెచ్చించినా..

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 1984లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల సదనం ఏర్పాటయింది. 60 మంది బాలలు ఇక్కడ నివాసం ఉంటూ, పక్కనున్న స్కూల్లో చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. చాలీ చాలని ఇరుకు గదుల్లో నడిచే సదనానికి 2019లో రూ.కోటి 55 లక్షలతో ఓ భవన సముదాయాన్ని నిర్మించారు. అంత మొత్తం వెచ్చించినా, పూర్తి స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోయారు. రెండు రీడింగ్ రూంలు, వంట గది, రెండు డార్మెటరీలు, గ్రంథాలయం, కౌన్సెలింగ్ హాలు, సూపరింటెండెంట్ గది, సిబ్బంది గది, సిక్ రూం, బాత్ రూంలు, లెట్రిన్లు నిర్మించారు. అయితే చుట్టూ రక్షణ గోడ నిర్మాణంలో పొదుపు పాటించారు. దీంతో తక్కువ ఎత్తులో ఉన్న రక్షణ గోడతో ఆకతాయిలు యథేచ్ఛగా రాకపోకలు సాగించొచ్చు.

అరకొర వసతులు

రక్షణ గోడఎత్తు పెంచాలని ఎప్పటి నుంచో పిల్లలు కోరుతున్నారు. మరోవైపు రక్షణ గోడ ఒక చోట కొంత భాగం ధ్వంసమైంది. దానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. దీంతో సరైన రక్షణ లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. సదనం భవన సముదాయం ముందు ఉన్న మైదానం రాళ్లు రప్పలతో నిండి, ఆడుకునేందుకు వీల్లేని స్థితి. దీంతో బాలలు ఆటలకు అవకాశం లేక ఇబ్బంది చెందుతున్నారు. గదుల్లో పుస్తకాలు, పెట్టెలు పెట్టుకోవడానికి అల్మరాలు లేవు. నేలపైనే వాటిని పెట్టుకోవలసి వస్తోందని బాలలు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఆశలు

బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇటీవల సందర్శించారు. పిల్లలతో మాట్లాడారు. సదుపాయాలు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇక బాల సదనంలో సదుపాయలు పూర్తి స్థాయిలో మెరుగుపడగలవని బాలలు, సంరక్షకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బాలలు స్వయంగా తమ వస్త్రాలు ఉతుక్కోవడం కష్టంగా ఉందని చెప్పడంతో, వాషింగ్ మెషిన్లు సమకూరుస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు. ఆ మేరకు తాజాగా ఒక వాషింగ్ మెషిన్ సమకూర్చారు. మరొకటి తర్వాత సమకూర్చనున్నారు. వచ్చే జూన్ నాటికి బాల సదనంలో సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని బాలలు, తల్లిదండ్రులు, సంరక్షకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

బాల సదనంలో సదుపాయాల మెరుగుపై మహిళా, శిశు సంక్షేమ శాఖకు నివేదించాం. ఆడుకునేందుకు వీలుగా మైదానం ఎత్తు చేయడం, రక్షణ గోడ మరమ్మతులు, ఎత్తు పెంచడం ప్రవేశ ద్వార తలుపులు ఏర్పాటు, గదుల్లో అరల ఏర్పాటు తదితర పనులు చేపట్టడానికి ప్రతిపాదించాం. మంత్రులు, జిల్లా కలెక్టర్, దాతల సహకారంతో త్వరలో పనులు చేపట్టేలా సన్నాహాలు జరుగుతున్నాయి.

– శశికళ, సూపరింటెండెంట్, బాల సదనం, కశింకోట

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం ముందు రహదారిపై క్యూకట్టిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ క్యూలైన్లతోపాటు ఆలయ ఆవరణ అంతా భక్తులతో కిట కిటలాడింది. అమ్మవారి నెల పండగ పూర్తయినప్పటికీ ఇంత పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయం కళకళలాడింది. క్యూలైన్లు కిక్కిరిసి, ఆలయ ముందు భాగంలో రహదారిపై అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా దేవదాయ శాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. చిన్నారులకు బాలింతలు పాలిచ్చేందుకు అధికారులు ఆలయ ఆవరణలో ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. బాలింతలు, చిన్నారులు కాసేపు సేదతీరారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. అమ్మవారి ఆలయం వద్ద వాసవీ ట్రస్టు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి అమ్మవారి భక్తులకు మజ్జిగ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు రత్నాకర్‌ను ట్రస్టు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, ట్రస్టు సభ్యులు బత్తుల గణపతి, బత్తుల వేణుమాధవ్, కడిమిశెట్టి సతీష్, పూసర్ల రాజా, యల్లపు శ్రీనివాస్, కొత్తా గోపీకృష్ణ, అన్నం రాజశేఖర్, తాటికొండ జీవన్ పాల్గొన్నారు.



భక్తులకు పండ్లు, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ అందిస్తున్న రత్నాకర్

బీజేపీ విధానాలతో దేశానికి నష్టం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత వెంకటేశ్వరరావు

అనకాపల్లి రూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశ ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో సీపీఎం, సీపీఐ పార్టీల నేతల సమావేశానికి ఆయన హాజరై బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఆక్షేపించారు. ప్రధాని మోదీ చేపడుతున్న చర్యలతో దేశంలో గత తొమ్మిదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యులు రెండు పూటలా తిండి తినలేని పరిస్థితి తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వ పాలకుల తీరుపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టాలన్న బీజేపీ నిర్ణయాలను సమావేశంలో ప్రసంగించిన పలువురు నేతలు దుయ్యబట్టారు. 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం చేస్తున్న అన్ని ప్రయత్నాలనూ సమష్టిగా అడ్డుకోవాలన్నారు.

బీజేపీని గద్దె దింపేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.రామునాయుడు, రాజాన దొరబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, ఆర్.శంకర్రావు, వీవీ శ్రీనివాసరావు, సీపీఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సీపీఐ సీనియర్ నాయకులు వైఎస్ భద్రం, వెంకటేశ్వరరావు, వి.రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



ఎంపీ సత్యవతితో జన్మదిన కేక్‌ను కట్ చేయిస్తున్న రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ఆధ్వర్యంలో బోయిలకింతాడలో పార్టీ శ్రేణుల మధ్య అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారితోపాటు పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమెను సత్కరించారు.

అనకాపల్లిటౌన్ : ఎంపీ సత్యవతిని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను పార్టీ శ్రేణులు గజమాల, దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, సచివాలయ కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఎంపీని శ్రీచైతన్య జూనియర్ కళాశాల జనరల్ ప్రిన్సిపాల్ ఎం.వి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ వై.ప్రదీప్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఇంటర్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో ప్రథమంగా నిలిచిన కళాశాలకు చెందిన విద్యార్థులను ఐఐటీలో సీటు సాధించాలని ఆశీర్వదించారు.

కశింకోట : ఎంపీ బీవీ సత్యవతిని ఆమె నివాసంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ దంపతులకు పూలమాల వేసి, కేకు కట్ చేయించి అభినందనలు తెలిపారు. బయ్యవరం ఎంపీటీసీ గొన్నా సత్యనారాయణ పాల్గొన్నారు.

3 నుంచి వేసవి శిక్షణ

తుమ్మపాల : వేసవి సెలవులను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీగౌరీ గ్రంథాలయంలో మే 3, నెల రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ, 4 నుంచి 15 రోజులపాటు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ ఇన్ కంప్యూటర్ కాన్సెప్ట్‌లో ఎంఎస్ ఆఫీస్, పవర్‌పాయింట్, ఇంటర్నెట్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 9247187355, 9247166511 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జమాదులపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామంలో సోమవారం ఉదయానికి బదులు సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాలసదనంలో ప్రవేశాలకు దరఖాస్తు

కశింకోట : కశింకోటలోని బాల సదనంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటిండెంటు శశికళ తెలిపారు. అనాథలు, తల్లిగాని, తండ్రిగాని లేని అనాథలు, పేదలు ప్రవేశానికి అర్హులన్నారు. 33 సీట్లు ఉన్నాయని, ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. వసతి గృహంలో ఉంటూ చదువుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సూపరింటెండెంట్, బాల సదనం, కశింకోట చిరునామాలో సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హరిద్వార్‌లో అనకాపల్లి విద్యార్థుల 'శివతాండవం'

అనకాపల్లిటౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో పుష్కరాల్లో ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో అనకాపల్లి శ్రీ వెంకటసాయి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు రాణించారు. హరిద్వార్‌లో ఏప్రిల్ 21 నుంచి 30 వరకు జరిగిన నృత్య ప్రదర్శనలో 8 మంది విద్యార్థుల శివతాండవం ఆకట్టుకుంది. విద్యార్థులను డిప్యూటీ మేయర్ బూలీకుమారి రానా బహుమతి ప్రదానం చేశారు.

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నూతన డీఎస్పీ వి.సుబ్బరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రి స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఇరువురు కాసేపు జిల్లాలో భద్రతాపరమైన అంశాలపై మాట్లాడుకున్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

ఎముకల వ్యాధులపై అవగాహన



వెద్య సేవలందిస్తున్న డాక్టర్ సోమేష్

రాంబిల్లి : కీళ్లు, ఎముకల వ్యాధులపై ప్రజలు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ టి.సోమేష్ సూచించారు. మామిడివాడ, అప్పన్నపాలెం గ్రామాల్లో రమా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల చివరి ఆదివారం సేవా దృక్పథంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రమా ఆస్పత్రి మేనేజర్ కనకయ్య, బీసీటీ సామాజిక కార్యకర్తలు శిగిరెడ్డి నాగేశ్వరరావు, గొర్లె దేవుడమ్మ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడనున్న క్రీడాకారులు

రాంబిల్లి : వాడనర్సాపురంలో ఆదివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. దుర్గాలమ్మ పండగ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.లక్షా 25వేల నగదును బహుమతిగా అందజేయనున్నారు.

వీరబ్రహ్మేంద్రునికి ప్రత్యేక పూజలు



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో భక్తులు స్వామి ఆలయానికి చేరుకుని పొలాల్లో పండిన పండ్లను స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

యోగాసనాలతో ఆరోగ్యం

అనకాపల్లిటౌన్ : పతంజలి యోగ సమితి అధ్యక్షుడు కోలపర్తి కన్నబాబును స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం రాత్రి భారతస్వాభిమాన్, జార్జిక్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కన్నబాబు యోగాసనాలతో పలువురికి ఆరోగ్య భిక్ష పెడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'మన్‌కీ బాత్'పై అవగాహన

మునగపాక : మండలంలోని మెలిపాక గ్రామంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా రైతులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తయిన సందర్భంగా రాంబిల్లి మండలం హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బీసీటీ సామాజిక కార్యకర్త పి.అప్పలనాయుడు, అభ్యుదయ రైతులు నాగేశ్వరరావు, రమేష్, కృష్ణమూర్తి, మాధవరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే 'మన్‌కీ బాత్'



మనకీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: మన్‌కీ బాత్ వందో ఎపిసోడ్‌ను ముత్యాలమ్మపాలెంలో మండల యువమోర్చా నాయకుడు మూస రామకృష్ణ స్వగృహంలో భాజపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం వీక్షించారు. సామాన్యుల అవసరాలు, ఆశయాలను ఆచరణలోకి తేవడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని రామకృష్ణ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ తన మాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్టు తెలిపారు.

3న విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చేపట్టనున్న నిర్వహణ పనుల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ పరవాడ ఏఈ శేషసాయి ఒక ప్రకటనలో తెలిపారు. పరవాడ, వెన్నలపాలెం, భర్నికం, రావాడ, ఈ.బోనంగి, తానాం, గొర్లివానిపాలెం , దేశపాత్రునిపాలెం, పి.ఎస్.బోనంగి, కలపాక, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దోసూరు, వెంకటాపురం గ్రామాలకు ఆరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శేషసాయి పేర్కొన్నారు. అసౌకర్యాన్ని మన్నించి, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం సముద్ర తీరం సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంటు, పరవాడ, దేశపాత్రునిపాలెం, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు తీరంలో సందడి చేశారు. తీరంలో ఇసుక తిన్నెలపై ఆట పాటలతో సరదాగా గడిపారు. సాయంత్రం జలకాలాటల్లో మునిగితేలారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

అనకాపల్లిటౌన్ : ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.చంద్రశేఖర్‌లు అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రీజియన్ పరిధిలో 42 బ్రాంచ్‌ల సిబ్బంది ఖాతాదారులకు అనునిత్యం ఉత్తమ సేవలందించడంలో మంచి ఫలితాలు చూపిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల నిధిని ఖాతాదారులకు సకాలంలో అందించాలని సూచించారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో మౌలిక వసతుల ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ నుంచి ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.